# యూదుల మారణహోమం-కొన్ని వాస్తవాలు




**2018** ఫిబ్రవరి 1న యూదుల మారణ హోమంపై పోలాండ్ సేనేట్ ఒక చట్టాన్ని ఆమోదించింది. ఇది పోలెండ్‌లోను, ప్రపంచ వ్యాపితంగానూ వివాదాస్పదంగా మారింది.

రెండవ ప్రపంచ యుద్ధకాలంలో యూదులకు వ్యతిరేకంగా నాజీలు చేసిన నేరాలలో పోలెండ్‌లో కొందరు భాగస్వాములయ్యారనే దృక్కోణాన్ని నిరాకరిస్తూ, 'పోలెండ్ ప్రజలు కూడా యూదుల వలనే బాధితులు' అని ఈ చట్టం నిర్ధారించింది. 'పోలెండ్ యొక్క గౌరవాన్ని కాపాడేందుకు, నాజీల చేతుల్లో యూదులవలెనే పోలెండ్ ప్రజలు శిక్షించ బడ్డారనే అంశాన్ని చరిత్రకారులచే గుర్తింప జేసేందుకు ఈ చట్టం అవసరమైందని పోలెండ్‌లో పాలన సాగిన్తున్న 'లా అండ్ జస్టిస్ పార్టీ' (పిఐఎస్)చెబుతోంది. 'పోలిష్ జాతిని లేక రాజ్యాన్ని నాజీ జర్మనీ సాగించిన నేరాలకు బాధ్యురాలిగా గానీ, సహ-బాధ్యురాలిగాగానీ చిత్రించిన' ఎవరికైనా గరిష్టంగా మూడు సం॥లు జైలుశిక్ష విధించేలా ఈ చట్టాన్ని రూపొందించారు.

అతి-మితవాద పార్టీ అయిన 'లా అండ్ జస్టిస్ పార్టీ' 2015లో పోలెండ్‌లో అధికారం చేపట్టిన నాటినుండి నేరాలకు సంబంధించిన వాస్తవాలు, సాక్ష్యాలను అణచిపెట్టేవిధంగా చరిత్రను తిరగ రాయడానికి పట్టు విడవకుండా ప్రయత్నిస్తోంది.

ఇక్కడ దీనికి సంబంధించిన కొన్ని చారిత్రక వాస్తవాలను చూద్దాం.

1930లలో, హిట్లర్ నాయకత్వంలోని ఫాశిస్టులు-విధ్వంసకర యుద్ధంద్వారా యావత్ ప్రపంచాన్ని తమ గుప్పెట బంధించాలనే దురాశా పూరిత వ్యూహంతో ప్రపంచయువనికపై రంగ ప్రవేశం చేశారు. ప్రపంచ పటంనుండి సోవియట్ యూనియన్‌ను తుడిచిపెట్టాలని, విప్లవాలను అణచివేయాలని, బ్రిటన్, ఫ్రాన్స్ దేశాల ప్రభావిత ప్రాంతాలను, వలస లను, అర్ధ-వలసలను తమ స్వాధీనం చేసు కోవాలని, యావత్ ప్రపంచంపై జర్మనీ ఆధిపత్యాన్ని రుద్దాలని హిట్లర్ భావించాడు.

జర్మన్ ఫాశిస్టు లను నిరోధించ టంలో యూరో పియన్ సామ్రాజ్యవాద దేశాలు విముఖతతో వుండగా, జర్మనీ ఫాశిస్టులు మొదట ఇతర దేశాలన్నింటినీ తమ అదుపులోకి తెచ్చుకుని సోవియట్ యూనియన్‌ను వేరుచేసి, ఒంటరిచేసి చావుదెబ్బ తీసే వ్యూహంతో ముందుకు సాగారు.

1939 ఆగస్టు 22న హిట్లర్ ఈ విధంగా ప్రకటించాడు: 'పోలెండ్ జనాభా తగ్గించబడుతుంది. వారు జర్మన్లతో స్థిరపడతారు....మిగతా వారందరికీ, రష్యాకు పట్టబోయే గతే పడుతుంది. సోవియట్ యూనియన్‌ను మేము బ్రద్దలుకొడతాం. తర్వాత, భూమండలంపై జర్మన్ పాలన ఉషోదయం జరుగుతుంది'.

1939 సెప్టెంబర్‌లో జర్మన్ ఫాశిస్టులు పోలెండ్‌పై దాడి చేశారు. నాజీల సైనికదాడుల ప్రధానాధికారి జనరల్ జోడ్ పేర్కొన్నట్లుగా బ్రిటిష్, ఫ్రెంచ్ సైనిక బలగాలు రంగంలోకి దిగకుండా, చూస్తూ కూర్చొనే వైఖరితో నుండటంతో సాపేక్షంగా సులభంగానే జర్మన్లు పోలెండ్‌ను ఆక్రమించ గలిగారు. జర్మనీ మొదట సోవియట్ యూనియన్‌ను విధ్వంసం చేయాలని ఫ్రాన్స్, ఇంగ్లండ్‌లు ఆశిస్తూ వున్నాయి. ఫాశిజమ్ వృద్ధి కాకుండా దానిని నిరోధించటానికి ఆంగ్లో - ఫ్రెంచ్ - సోవియట్ సహకారం మరియు సమిష్టి భద్రతల గురించి సోవియట్ యూనియన్ చేసిన ప్రతిపాదనలను ఫ్రెంచ్, బ్రిటిష్ ప్రభుత్వాలు పెడచెవినబెట్టాయి. నాజీ జర్మనీ పోలెండుపై ఓవైపునుండి దాడిచేయగా, పోలెండ్ ప్రజలు ఫాశిస్టుల ఆగ్రహజ్వాలల్లోకి నెట్టివేయబడ్డారు. మరోవైపున పోలెండ్ పాలక బృందాలు జర్మన్ దురాక్రమణదారుల ముందు సాగిలపడ్డాయి. 1939 అక్టోబర్ ప్రారంభ దినాలకే పోలెండ్ మొత్తం హిట్లర్ పాదాక్రాంతమైంది.

నాజీల ఆక్రమణలోకి పోలెండ్ వెళ్ళి పోవటంతో, జర్మనీ ఫాశిస్టులు తమ మూకుమ్మడి హత్యాకాండను కొనసాగించారు. మారణహోమంగా పిలవబడే జనహనన కార్యక్రమంలో జర్మనీ ఫాశిస్టులు పోలెండ్‌లోని దాదాపు సగంమంది యూదులను (15 లక్షలమందిని) ఊచకోతకోశారు. యూరోపు లోని వివిధ ప్రాంతాలనుండి పోలెండుకు తీసుకు వచ్చిన యూదులందరినీ మరణకేంద్రాల వద్ద- ప్రత్యేకించి పోలెండ్‌గడ్డపై, ఇతర ప్రాంతాలలో నిర్మించి, నిర్వహించిన మరణకేంద్రాలవద్ద మూకుమ్మడిగా హత్యగావించారు. అమెరికాకు చెందిన 'హోలో కాస్ట్ మెమోరియల్ మ్యూజియమ్' అందించే వివరాల ప్రకారం నాజీఫాశిస్టులు యూదులుకాని ఇతర పౌరులను కనీసం 19 లక్షలమందని హత్యగావించారు.

పోలెండ్ పాలక బృందాలు జర్మనీ ఫాశిస్టుల ఎదుట సాగిలబడటం; పోలెండులోని కుట్రదారు లతో, ఫాశిస్టు కుమ్మక్కుదారులతో చేతులు కలపటంతో మరింత సునాయాసంగా ఘోరమైన నేరాలు సాగించటానికి నాజీల హస్తాలను దృఢపరిచి నట్లయింది. చరిత్రకు సంబంధించిన వాస్తవమిది.

సాధారణ పోలెండ్ ప్రజలు–మరీ ప్రత్యేకించి, జర్మన్ దాడి, దురాక్రమణ, అత్యాచారాలను వ్యతిరేకించి, దానికి వ్యతిరేకంగా పోరాడిన ప్రజానీకం అత్యంత బాధలనుభవించారు; ఎన్నో త్యాగాలు చేశారు. అత్యంత కష్టభరితమైన సమయంలో వారు ఈ విధంగా చేశారు. పోలెండ్ ప్రజల పోరాటం, జర్మన్‌లు సాగించే యూదుల మూకుమ్మడి హత్యాకాండకు వ్యతిరేకంగా కూడా సాగింది. యూదుల ప్రాణాలను కాపాడటంకోసం వారెన్నో సాహసోపేత ప్రయత్నాలు చేశారు.

పోలెండ్ ప్రజలయొక్క, పోలెండ్ జాతియొక్క గౌరవాన్ని నిజాయితీగా కాపాడే మార్గం ఇలా వుండాలి: ఫాశిస్టుల దాడికి, పోలెండు దురాక్రమణలకు వ్యతిరేకంగా; నాజీలు చేపట్టి కొనసాగించిన యూదుల మూకుమ్మడి మారణకాండ విధానాలకు వ్యతిరేకంగా–పోలెండ్ ప్రజలు సాగించిన చారిత్రక పోరాట సాంప్రదాయాన్ని ఎత్తిపట్టాలి. రెండవ ప్రపంచ యుద్ధకాలంలో ఫాశిస్టుల అనుయాయులుగా వ్యవహరించి, తమ చేతులను రక్తపంకిలం చేసుకున్న పోలెండ్ పాలక బృందాల, విభాగాల, కుట్రదారులయొక్క ద్రోహాన్ని విడమర్చి చెప్పాలి.

కుట్రదారుల ముఖానికి ఫాశిస్టు వ్యతిరేక కుంచెలతో రంగులద్దే ప్రయత్నాలు, తమ బాధ్యత నుండి విముక్తులవటానికి, తమ బాధ్యతనుండి తప్పుకోవటానికి ప్రస్తుత పోలెండ్ దేశ పాలకులు చేసే ప్రయత్నాలన్నీ, వారి నిజ ఉద్దేశ్యాలను మరుగు పరిచేందుకే. అసంతృప్తి గళాలను, చర్చలను అణచి వేయడానికి పోలెండ్ ప్రభుత్వం చేపట్టే చర్యలు, చట్టంద్వారా ఒక దృక్కోణాన్ని రుద్ది, శిక్ష విధింప జేయటం–వంటివన్నీ ప్రతికూలమైనవిగా మిగిలి పోతాయి. పోలెండ్‌లో పెరుగుతున్న ప్రజాస్వామిక నిరసనలలో మనం ఈ ధోరణిని గమనించవచ్చు.

ooooo